## బహుమతి పొందిన చిట్టి కథ



# ఉలిక్కిపడిన మనసు

**— తమిరిశ జానకి**

కాఫీతాగుతూ కిటికీలోంచి బయటికి చూశాను యాదాలాపంగా. ఎదురింట్లో... ఆ పాత పెంకుటింట్లో ఉండే తాయారమ్మ హడావిడిగా తిరుగుతూ కనపడింది. నాకు తెలిసి నాలుగేళ్ళుగా ఆమె మొహంలో ఈ కళ నేను చూడలేదు...ఇంత ఉత్సాహంతో తిరగడమూ చూడలేదు... ఇప్పుడామె వయసు ఏభైయ్యేళ్ళు.... కానీ దిగులు తెచ్చిన వృద్ధాప్యంతో అరవయ్యేళ్ళు పైబడినట్టు కనిపిస్తుంది. నాలుగేళ్ళకిందట కొడుకు ఇంట్లోంచి వెళ్ళిపోయినప్పటినించీ అలా అయిపోయిందామె. ఆ దిగుల్తోనే ఆమె ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. అసలామె వండుకుంటోందా? తింటోందా అన్నది ఆ దేవుడికే తెలియాలి. తిండిమీదేకాదు... దేనిమీదా ఆసక్తిలేకుండాపోయిందామెకి... నాలుగేళ్ళుగా ఆమె మొహంలో చిరునవ్వే కరువైంది... ఆమె కొడుకు... ఇరవై రెండేళ్ళవాడు... ఇంట్లోంచి కోపంగా వెళ్ళిపోయినరోజు... ఆ రోజు నాకు బాగా గుర్తే... అసలు... వాడికోసమే బతికినట్లుగా బ్రతుకు గడిపిందామె. కట్టుకున్న భర్త తాగుడు వ్యసనానికి బలి అయిపోతే... తానే అన్నీ అయి కంటికి రెప్పలా కొడుకుని పెంచిపెద్దచేసింది. వాడు తింటే ఆమెకి ఆకలితీరేది. వాడు నవ్వితే ఈ లోకమంతా సుందరంగా కనిపించేది ఆమెకి. వాడికి ఏ చిన్న దెబ్బ తగిలినా ఆమె ప్రాణం గిల గిలలాడేది... అటువంటి తల్లితో ఏదో చిన్న విషయానికి వాదనలోకి దిగి దాన్ని పెద్ద ఘర్షణగా మార్చి, తన మంచిని దృష్టిలో పెట్టుకునే ఆమె చెప్తోందన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా, కోపంతో అప్పటికప్పుడు... ఆమె ఎంత బతిమాలుతున్నా వినిపించుకోకుండా విసురుగా ఒక్క తోపు తోసి వెళ్ళిపోయాడు. ఆ తోపుకి ఆమెదేనిమీదో పడబోయి ఒక చేత్తో ఆపుకోవాలని ప్రయత్నించడంతో బరువంతా ఆ చేతిమీదే ఆని చేయి మెలితిరిగింది. ఫ్రాక్చరైందన్నాడు డాక్టరు. మూడునెలల పైనే ఆమెపడింది ఆ బాధతో నరకయాతన-చూసేందుకు మరో దిక్కులేదు ఇంట్లో. ఆ కొడుకుని తిట్టనివాళ్ళు లేరు ఈ వీధిలో.

ఎదురింట్లోంచి కమ్మటి పిండివంటల వాసనలు కూడా వొస్తున్నాయి. రోజూ అన్నమైనా అసలు వొండుకు తింటోందో లేదో పాపం అనిపించే తాయారమ్మ ఇంత పెందరాళే పిండివంటల్తో వంట మొదలెట్టిందంటే ఆశ్చర్యమే మరి... మనోవ్యాధితో పూచికపుల్లలా అయిపోయిన ఆమె ఎక్కడలేని ఓపికా తెచ్చుకుని చలాకీగా తిరిగేస్తోంది... ఏ కారణం అంత ఓపికనిచ్చిందో...?

"ఏవిటి రంగయ్యా? గట్టిగా నాలుగడుగులు వెయ్యలేని ఆ తాయారమ్మ అంత ఉత్సాహంగా అలా తిరిగేస్తోంది. ఏమిటి సంగతి?" కాఫీ కప్పుకడగడానికి తీసికెళ్తున్న మా పని కుర్రాడు రంగయ్యని అడిగాను వాడికేమన్నా తెలుసేమోనని.

"ఆళ్లబ్బాయి నాగులు ఇయ్యాలొస్తున్నట్టు ఉత్తరవొచ్చిందంట నిన్న. అందుకె అతగాడికి నచ్చే వంటకాలు రకరకాలు సేస్తాఉంది— ఎక్కడలేని ఓపికా తెచ్చుకుని" చెప్పాడు రంగయ్య.

అదన్నమాట సంగతి.

"అదిగోండి బాబుగారూ... నాగులు వొచ్చేశాడు." హడావిడిగా అంటూ కిటికీలోంచి బయటికి చూపించాడు రంగయ్య తొమ్మిదిన్నరవుతుండగా. అద్దం ముందు నిలబడి తలదువ్వుకుంటున్న నేను, అటువైపు చూశాను. అంతే... తుళ్ళిపడ్డాను... నాలుగేళ్ళక్రిందటి వరకూ ఏ అవకరం లేకుండా ఉండిన నాగులు... ఇప్పుడు... కుంటివాడు. ఓ కాలు లేదు... ఒక్క పరుగున బయటికి వెళ్ళాడు రంగయ్య. యాక్సిడెంట్లో కాలుపోయిందని నాగులు రంగయ్యతో చెప్పడం వినపడింది నాకు... ఇప్పుడర్థమైంది... అందుకే ఇప్పుడు తల్లిగుర్తొచ్చినట్టుంది నాగులుకి... లేకపోతే.... కుంటివాడు కాకుండా ఉండి ఉంటే తల్లి దగ్గరకి వొచ్చే వాడేకాదన్న మాట...

లోపల్నుంచి తాయారమ్మ రావడం కనపడింది... వీధి వరండాలోకి వెళ్ళి నిలబడ్డాను. "అవిటి బతుకు బతకడం కష్టం కాబట్టి ఇప్పుడు నేను గుర్తొచ్చానా నీకు? ఇన్నాళ్ళూ నేనెలా ఉన్నానో ఏమైపోయానో, తింటున్నానో లేదో ఏమీ అక్కర్లేకపోయింది నీకు. ఇప్పుడు నీస్వార్థం కోసం ఇంటికి చేరావన్నమాట" అంటూ తాయారమ్మ కొడుకుని గట్టిగా దులిపేస్తుందనుకున్నాను. నా ఊహని జంకాలేదు. చూసేవారి మనసులు ద్రవించిపోయేలా ఏడుస్తూ కొడుకుని దగ్గిరకి తీసుకుంది. ఆప్యాయంగా, పెల్లుబికే మమకారంతో అతని చేయి అందుకుని తన భుజమ్మీద వేసుకుని మెల్లిగా నడిపించుకుంటూ లోపలికి తీసికెళ్తోంది. వయసైపోతున్న తల్లి భారం మోయవలసిన కొడుకు అతను... కానీ... ఆ కొడుకు భారం తన మీద వేసుకుని ముందుకు సాగుతోంది ఆ తల్లి.

"నాగులు నీ కళ్ళకి తప్పుచేసినవాడిలా కనిపిస్తున్నప్పుడు, మరి, నీ సంగతేమిటి?" హఠాత్తుగా నిలదీసింది నా అంతరాత్మ నన్ను... ఉలిక్కిపడింది మనసు. "ఒక్కదాన్నీ ఉండలేకపోతున్నానురా బిక్కు బిక్కుమంటూ... నన్నుకూడా నీతో తీసుకుపోరా. నీదగ్గిరుంటేనా ధైర్యం" అంటూ మా ఊరు వెళ్ళినప్పుడల్లా అమ్మ నాతో మొత్తుకుంటున్నా కూడా, ఇక్కడ మా విలాస జీవితానికి అమ్మ ఒక ప్రతిబంధకంగా భావించి, ఎప్పటికప్పుడు ఏదో చెప్పేసి వొచ్చేస్తున్నాను నేను—ఆమెని నాతో తీసుకురాకుండా... అందుకే ఉలిక్కిపడింది నా మనసు.